క్లుప్తంగా

అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన



సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఉదయం స్వర్ణపుష్పార్చన వైభవంగా జరిగింది. ఆలయ బేడా మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుదీర్చారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. విశేష హారతులందించారు. పూజలో పాల్గొన్న భక్తులకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు.

అప్పన్న సన్నిధిలో ఎమ్మెల్యే అదితి గజపతి



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు గురువారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆమె పేరిట అర్చకులు అంతరాలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి శేషవస్త్రం, ప్రసాదం, జ్ఞాపికను ఏఈవో ఆనంద్ కుమార్ అందజేశారు.

వైఎస్సార్‌సీపీ నేత శివకు అదీప్‌రాజ్ పరామర్శ



శివను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ముదపాక శివను మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సోమవారం పరామర్శించారు. ఆప్యాయంగా పలకరించి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ మధుపాడ నాగమణి, పార్టీ ముఖ్యనేతలు మధుపాడ అంజి, గొరపల్లి శ్రీను, కార్యకర్తలు ఉన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా..



సుజాతనగర్‌లో జనసేన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

పెందుర్తి: సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజలకు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. సుజాతనగర్‌లో నూతనంగా నిర్మించిన జనసేన నియోజకవర్గ కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ముందుగా కార్యాలయంలో శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మర్రి చెట్లను నరికేశారు



అసకపల్లి-లంకెలపాలెం రోడ్డులో కొట్టివేసిన మర్రి చెట్లు

సబ్బవరం: పచ్చదనాన్ని పెంచండి.. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటండని ప్రచారం చేస్తుంటే.. మండలంలోని అసకపల్లి-లంకెలపాలెం రోడ్డులో ఎరుకునాయుడుపాలెం వద్ద భారీ మర్రి చెట్లను కొందరు నరికేశారు. చిన్న చిన్న చెట్లు తొలగించాలన్నా.. రెవెన్యూ, ఫారెస్ట్ అధికారుల అనుమతులు తప్పనిసరి. అలాంటిది ఆర్ అండ్ బీ ప్రధాన రహదారిలోని భారీ వృక్షాలను ఎలాంటి అనుమతుల్లేకుండా కట్ చేయడంపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఆర్ అండ్ బీ ఏఈ కృష్ణారావును వివరణ కోరగా విషయం తన దృష్టికి కూడా వచ్చిందన్నారు. ప్రస్తుతం అనారోగ్యంతో సెలవులో ఉన్నట్లు తెలిపారు. ఇప్పటికే సంబంధిత వీఆర్వోకి సమాచారం అందించి, విచారణ చేపట్టి చెట్లు కొట్టిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

విష జ్వరాలు.. వణుకుతున్న జనం

పల్లెలు మంచం పట్టాయి. అడపాదడపా కురుస్తున్న వర్షాలతో సీజనల్ రోగాలు ప్రబలుతున్నాయి. విష జ్వరాల బారినపడి ప్రజలు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. జ్వరం, దగ్గు, జలుబు, తలనొప్పి, ఒళ్లు నొప్పులతో ఇబ్బందులు పడుతున్నారు. ఆగిఆగి కురుస్తున్న వర్షాలకు వాతావరణంలో నెలకొన్న మార్పులే ఇందుకు కారణమని వైద్యులు చెప్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, జ్వరాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పరవాడ, వాడచీపురుపల్లి పీహెచ్‌సీ వైద్యులు సూచిస్తున్నారు.

- వర్షాలతో ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు
- ఆస్పత్రులకు క్యూ కడుతున్న వైరల్ ఫీవర్ బాధితులు
- రెండు పీహెచ్‌సీల్లో వారం రోజుల్లో దాదాపు 200 కేసులు



పరవాడ పీహెచ్‌సీలో వైద్యం కోసం నిరీక్షిస్తున్న రోగులు



పరవాడ: వాతావరణంలో వచ్చిన ఆకస్మిక మార్పులతో సీజనల్ వ్యాధులు మండల ప్రజల్ని పట్టిపీడిస్తున్నాయి. మండలంలో పరవాడ, వాడచీపురుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఈ నెల రెండో వారం నుంచి వైరల్ ఫీవర్లు అధికమయ్యాయి. జ్వరం, దగ్గు, జలుబు, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, టైఫాయిడ్, మలేరియా వంటి వ్యాధి లక్షణాలతో గ్రామీణ ప్రజలు సతమతమవుతున్నారు. సీజనల్ వ్యాధులు, విష జ్వరాలు ప్రబలి ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి.

ఇంటింటి సర్వేలో వైద్య సిబ్బంది

విష జ్వరాలు ప్రబలుతుండటంతో వైద్య సిబ్బంది అప్రమత్తయ్యారు. ప్రజల్లో చైతన్యం కలిగించి, రోగాల వ్యాప్తికి కారణమయ్యే దోమల నియంత్రణకు కృషి చేస్తున్నారు. దీనికితోడు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది తమ పరిధిలోని గ్రామాలకు వెళ్లి, ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నారు. దగ్గు, జ్వరం, జలుబు తదితర లక్షణాలతో బాధపడేవారిని గుర్తించి, సత్వరమే అవసరమైన వైద్యం అందించేందుకు తమ వంతు కృషి చేస్తున్నారు. ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిలిచిపోకుండా స్థానికులకు అవగాహన కల్పిస్తున్నారు. వారంలో ఓ రోజు ఇళ్లలోని నీటిని నిల్వ చేసే పాత్రలన్నింటినీ ఖాళీ చేయించి, వాటిని పూర్తిగా ఆరబెట్టేలా చర్యలు తీసుకుంటున్నారు.

పారిశుధ్య చర్యలు పూజ్యం

వానాకాలంలో పారిశుధ్య విభాగం పాత్ర కీలకం. ప్రతి వీధిలో డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి. దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్, దోమల మందు పిచికారీ చేయాలి. అయితే మండల పరిధిలో ఆ చర్యలు నామ్‌కే వాస్తేగా మారాయి. అడపాదడపా అక్కడక్కడ దోమల మందు పిచికారీ చేసి సరిపెట్టేస్తున్నారు. డ్రైనేజీల్లో పేరుకుపోయిన పూడికల్ని తొలగించే పరిస్థితులే కానరావట్లేదు. దీంతో దోమలు వ్యాప్తి చెంది, ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరపాలని ప్రజలు పంచాయతీ అధికారుల్ని కోరుతున్నారు.

వారం రోజుల్లో 200కు పైగా కేసులు

మండలంలోని పరవాడ, వాడచీపురుపల్లి పీహెచ్‌సీ పరిధిలోని చాలా గ్రామాల్లో ప్రజలు సీజనల్ వ్యాధులతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. చాలా మంది మంచంపట్టారు. పరవాడ పీహెచ్‌సీ పరిధిలో పరవాడ, పెదముషిడివాడ, తానాం, వాడచీపురుపల్లి పీహెచ్‌సీ పరిధిలో గొర్లివానిపాలెం, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, ముత్యాలమ్మపాలెం, వాడచీపురుపల్లి గ్రామాల్లో సీజనల్ వ్యాధులు అధికంగా నమోదవుతున్నట్లు ఆస్పత్రి వర్గాలు చెప్తున్నాయి. ఈ రెండు పీహెచ్‌సీల పరిధిలో వారం రోజుల వ్యవధిలో 200 మందికి పైగా వైరల్ ఫీవర్లతో పీహెచ్‌సీల్లో చేరి, చికిత్స పొందారు. ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం పొంది, క్షేమంగా ఇంటిబాట పట్టినవారు అంతకంటే ఎక్కువే.



పరవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



బొంకులదిబ్బ గెడ్డ: ఇలా ఉంటే దోమలు పెరగవా..





జ్వరంతో బాధపడుతున్న రోగులు

వ్యాధి నిరోధక శక్తిని కాపాడుకోవాలి



సీజనల్ రోగాలు ప్రబలే కాలంలో వ్యాధి నిరోధక శక్తిని పెంచే ఆహార పదార్థాలు తీసుకోవాలని వాడచీపురుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ క్రాంతికుమార్ తెలిపారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరూ పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు.

- జ్వర పీడితులతోపాటు ఇంటిల్లపాదీ వేడి చేసిన నీటిని మాత్రమే తీసుకోవాలి.
- వ్యాధి నిరోధక శక్తిని పెంచే పళ్ల రసాలు, కొబ్బరి నీళ్లు తీసుకుంటే మేలు.
- దోమల వ్యాప్తిని నిరోధించేలా ఇంటి పరిసరాలను, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి. నిల్వ నీటిని వారంలో ఓ రోజు పూర్తిగా తొలగించి, పాత్రలను ఆరబెట్టాలి.
- దోమ కాటుకు గురికాకుండా దోమతెరలు, వాటిని పారద్రోలే రసాయనాలు, కాయిల్స్ వినియోగించాలి.
- ఆహారం తీసుకునేటపుడు, కాలకృత్యాలు తీర్చుకునేటపుడు కాళ్లుచేతుల్ని సబ్బుతో శుభ్రపరచుకోవాలి.
- వ్యాధులకు గురైన వారిని ప్రత్యేకంగా ఉంచి, చికిత్స అందించాలి.
- తుమ్ములు, దగ్గులు వచ్చినపుడు మాస్క్ ధరించి, తగతు జాగ్రత్తలు తీసుకోవాలి.

పెరిగిన జ్వర పీడితులు



మా పీహెచ్‌సీకి రోజూ కనీసం పది మంది జ్వరంతో బాధపడుతూ చికిత్స కోసం వస్తున్నారు. వైరల్ ఫీవర్లతో వచ్చిన రోగులకు రక్తపరీక్షలు చేసి, అవసరమైన వైద్యం అందిస్తున్నాం. స్థానిక జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో వైరల్ ఫీవర్ కేసులు అధికంగా నమోదవుతున్నాయి. వైద్య సిబ్బందిని ఇంటింటికీ పంపించి, సర్వే జరిపి, విష జ్వరాలపై అప్రమత్తం చేస్తున్నాం.

– డాక్టర్ హారిక, వైద్యాధికారి, పరవాడ పీహెచ్‌సీ

ఘనంగా మాతృభాష, క్రీడా దినోత్సవాలు



యోగాలో రాణిస్తున్న విద్యార్థి జయలక్ష్మిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సీతాలక్ష్మి



గిడుగు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



తెలుగు ఉపాధ్యాయుడు అప్పలనాయుడును సత్కరిస్తున్న దృశ్యం



సంస్కృతి గ్లోబల్ స్కూల్లో నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాతృభాష, జాతీయ క్రీడా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. యోగాలో జాతీ స్థాయిలో ప్రతిభ కనబరుస్తున్న కళాశాలకు చెందిన ఫస్టియర్ విద్యార్థి పి.జయలక్ష్మిని ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి, అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం పెరుగుతుందన్నారు. తెలుగు భాషా దినోత్సవంలో భాగంగా తెలుగు భాష గొప్పదనాన్ని వివరించారు. మాతృభాష అమ్మవంటిదని, మన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలని విద్యార్థులకు సూచించారు.

కార్యక్రమంలో కళాశాల స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ ఎంవీ రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శంకర్, అధ్యాపకులు రత్న ప్రకాష్, గోవింద్, జాతీయ సేవా సమితి సమన్వయకర్త డాక్టర్ ఎల్.గణేష్ తదితతరులు పాల్గొన్నారు.

పరవాడ: తెలుగు భాషాభివృద్ధికి వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు విశేష కృషి చేశారని వాడచీపురుపల్లి జిల్లా పరిషత్ పాఠశాల హెచ్‌ఎం పందిరి కనకేశ్వరరావు అన్నారు. వాడచీపురుపల్లి జెడ్పీ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గిడుగు రామ్మూర్తి పంతులు, హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్‌ల చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. రాంకీ ఫౌండేషన్ సౌజన్యంతో నిర్వహించిన పద్యాల పోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు పల్లి అప్పలనాయుడు, కామేశ్వరి, జి.అప్పలరాజు, పీడీ అన్నాజీరావులను ఘనంగా సత్కరించారు. రాంకీ మేనేజర్ కె.శ్రీకాంత్, శ్రీనివాసరెడ్డి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మండలంలో పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. తెలుగు భాషా గొప్పతనంపై ఆటలు, తెలుగు భాష యాసల వ్యత్యాసంపై నాటకం, శతక కవుల పద్యాలు, పదో తరగతి పిల్లలతో డాక్టరు మౌమిత ఘటనపై సామాజిక స్పృహ కలిగించే దృశ్య రూపకం విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి మాట్లాడుతూ ప్రజలకు అర్థం కాని భాషలో ఉన్న విజ్ఞానం ప్రజలకు మేలు చేయదని భావించిన తెలుగు భాషా పండితుడు గిడుగు రామ్మూర్తి పంతులు వ్యావహారిక భాషను పుస్తకాల్లో వినియోగించాలని చేసిన ఉద్యమాన్ని పిల్లలకు వివరించారు. మాతృ భాషను కాపాడుకోవడమే ఆ మహనీయుడికి అందించే ఘన నివాళి అన్నారు. కార్యక్రమంలో పాఠశాల సీఈవో కె.నిశాంత్, ఉపాధ్యాయులు సోనాశాంతి, వినీల, పూజిత, లీల పాల్గొన్నారు.

గొర్లివారి కాలనీ సమస్యకు పరిష్కారం



రైల్వే అధికారులతో మాట్లాడుతున్న బీజేపీ నేత గొర్లె రామునాయుడు

పెందుర్తి: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని గొర్లివారికాలనీ సమస్యకు రైల్వే అధికారులు పరిష్కారం చూపారు. కొద్దిరోజుల క్రితం రైల్వే శాఖకు చెందిన స్థలంలో ప్రహరీ నిర్మాణం కోసం అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. అయితే ఇక్కడ ప్రహరీ నిర్మాణం చేపడితే తమ రాకపోకలకు ఇబ్బందులు కలుగుతాయని కాలనీవాసులు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గొర్లె రామునాయుడు ఆధ్వర్యంలో ఎంపీ సి.ఎం.రమేష్, మాజీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహరావు, ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబులకు వినతిపత్రాలు అందించారు. ఈ నేపథ్యంలో గురువారం ఈ ప్రాంతంలో పర్యటించిన రైల్వే అధికారులు ప్రహరీ నిర్మాణం చేపట్టినా కాలనీ వాసుల రాకపోకల కోసం 15 అడుగుల రోడ్డు నిర్మిస్తామని భరోసా ఇచ్చారు. కల్వర్టు కూడా నిర్మిస్తామన్నారు. ప్రజాప్రతినిధులకు, రైల్వే అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

అయోధ్య రామబాణ దర్శనం.. తరించిన భక్తజనం



అయోధ్య రామబాణాన్ని సందర్శిస్తున్న భక్తులు

మద్దిలపాలెం: అయోధ్య రామాలయానికి అందజేయనున్న వెండి ధనుస్సును కొత్త వెంకోజీపాలెం వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తుల సందర్శనార్థం గురువారం ఉంచారు. హైదరాబాద్‌కు చెందిన చల్లా శ్రీనివాస శాస్త్రి కేజీ బంగారం, 14 కేజీల వెండితో రామబాణాన్ని తయారు చేయించారు. శ్రీరామ కోదండాన్ని స్థానికులతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అనేక మంది భక్తులు తరలి వచ్చి సందర్శించి, భక్తితో మొక్కుకున్నారు.

మైకేల్ జాక్సన్ పాటలకు నోటితో సంగీతం

- నేడు కళాభారతిలో కార్యక్రమం



డీటీఎస్ రమేష్

డాబాగార్డెన్స్: అంతర్జాతీయంగా సంగీత ప్రియులను ఉర్రూతలూగించిన మైకేల్ జాక్సన్ జయంతిని పురస్కరించుకుని ఆయన పాటలకు మిమిక్రీ కళాకారుడు డీటీఎస్ రమేష్ తన నోటితో సంగీత ప్రదర్శన ఇవ్వనున్నారు. విశాఖలో ఇంగ్లిష్ వెస్టర్న్ నైట్‌గా చూపించబోతున్న ఈ కార్యక్రమంలో మైకేల్ జాక్సన్ 10 పాటలకు రమేష్ సంగీతాన్ని అందించనున్నారు. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియం వేదికగా శుక్రవారం సాయంత్రం 6 గంటల నుంచి నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంగీత ప్రియులు, మైకేల్ జాక్సన్ అభిమానులను రమేష్ కోరారు. నోటి ద్వారా సంగీత ధ్వని అనుకరణతో జరిగే ఈ ప్రక్రియకు తానిచ్చిన పలు ప్రదర్శనల్లో విశేష ఆదరణ దక్కిందన్నారు.

వైభవంగా మరిడిమాంబ పండగ



మరిడిమాంబను దర్శించుకున్న వైఎస్సార్‌సీపీ నేతలు

పరవాడ: మండల కేంద్రంపరవాడ గ్రామంలో కొలువుదీరిన మరిడిమాంబ అమ్మవారి పండగను గ్రామ ప్రజలు గురువారం ఘనంగా నిర్వహించారు. పండగను పురస్కరించుకుని భక్తులు అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి, అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. పండగలో భాగంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడులు అమ్మవారిని దర్శించుకొని పూజలు జరిపారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనను ప్రారంభించి, భక్తులకు వడ్డించారు.

సమీప గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో అన్నసమారాధనలో పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బి.రామారావు, పైల హరీష్, వర్రి లక్ష్మీ అప్పలనాయుడు, పైల పైడినాయుడు, సీహెచ్ శ్రీనివాసరావు, గండి రాము, సీహెచ్ సన్యాసిరావు, చుక్క తాతాజీ అమ్మవారిని దర్శించుకొని పూజలు జరిపారు.

ట్రాఫిక్ జామ్‌తో ప్రయాణికుల ఇక్కట్లు



యలమంచిలి-పరవాడ రహదారిలో నిలిచిపోయిన వాహనాలు

పరవాడ: యలమంచిలి-గాజువాక రహదారిలో ఊటగెడ్డ కూడలి-పరవాడ మధ్య గురువారం ఉదయం ట్రాఫిక్ జామ్ కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఊటగెడ్డ కూడలి వద్ద రెండు భారీ వాహనాలు ఇరుక్కుపోవడంతో వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. బుధవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షం దీనికి తోడై, రోడ్లు అధ్వానంగా మారాయి. ఉదయం 9–10 గంటల సమయంలో ఎన్టీపీసీ, ఎస్ఈజెడ్, హిందూజా పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, ఉద్యోగుల రాకపోకలతో రద్దీగా మారడం, ఆపై ట్రాఫిక్ జామ్ కావడంతో ద్విచక్ర వాహనాలు, కార్లు, ఇతర వాహనాల రాకపోకలకు అవస్థలు ఎదురయ్యాయి. చేసేది లేక చిన్న వాహనాలన్నీ వెన్నెలపాలెం మీదుగా రాకపోకలు సాగించడంతో ఆ రోడ్డులో కూడ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి, వాహనదారులు ప్రయాణికులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. పోలీసులు రంగంలోకి దిగి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంతో వాహనదారులు ఊపిరిపీల్చుకున్నారు.

అనాథాశ్రమాలు, గురుకులాల్లో తనిఖీలు



వెదుళ్లనరవలోని చిల్డ్రన్ ఆఫ్ ఫెయిత్ వసతి గృహాన్ని పరిశీలిస్తున్న అధికారుల బృందం

సబ్బవరం: మండలంలోని పలు అనాథ శరణాలయాలను, గురుకుల పాఠశాలలను సీఐ పిన్నింటి రమణ, సీడీపీవో లలిత్ కమారి తదితరుల బృందం గురువారం సందర్శించి, తనిఖీలు నిర్వహించారు. ఇటీవల కోటవురట్లలోని ఆశ్రమ వసతిగృహంలో విద్యార్థులు కలుషితాహారం తిని, అస్వస్థతకు గురైన నేపథ్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. మండలంలోని బోదువలస రిషి గురుకులం, దేవీపురంలోని డాన్ బాస్కో వసతి గృహం, వెదుళ్లనరవలోని చిల్డ్రన్ ఆఫ్ పెయిత్ వసతి గృహాల వంట గదులను, సరకులను పరిశీలించారు. అక్కడి వసతులపై ఆరా తీశారు. రికార్డులు తనిఖీ చేసి, నిర్వాహకులకు అనుమతులున్నాయా? లేదా? అని సంబంధిత పత్రాలను పరిశీలించారు. విద్యార్థుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిర్వాహకులకు పలు సూచనలిచ్చారు. సీజనల్ రోగాలు ప్రబలుతున్న నేపథ్యంలో ఎవరికి ఏ చిన్న అనారోగ్యం వచ్చినా అశ్రద్ధ చేయొద్దని హెచ్చరించారు. వీరి వెంట డిప్యూటీ తహసీల్దార్ వెంకట్, వీఆర్వో వెంకటేష్ తదితరులు ఉన్నారు.

ఏరువాకా సాగారో..



ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న దృశ్యం



వరినాట్లు వేస్తున్న మహిళలు

నియోజకవర్గంలో ఖరీఫ్ వరినాట్ల ప్రక్రియ తుదిదశకు చేరుకుంది. సబ్బవరం, పరవాడ, పెందుర్తి ప్రాంతాల్లో జోరుగా వ్యవసాయ పనులు సాగుతున్నాయి. గత కొద్ది రోజులుగా వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో పెందుర్తి గ్రామీణ ప్రాంతంలో వరినాట్ల ప్రక్రియ ఆలస్యమైంది. నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో దమ్ములు, వరినాట్లు మళ్లీ జోరందుకున్నాయి. చెరువుల్లో చేరిన కొద్దిపాటి నీటిని రైతులు డీజిల్/పెట్రోల్ మోటార్ల సాయంతో పొలాలకు తోడి, నాట్లు వేస్తున్నారు.

– పెందుర్తి